క్లుప్తంగా

వేతన బకాయిలు చెల్లించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బెల్లంపల్లి: ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఆరు నెలల నుంచి బకాయిపడిన పెండింగ్ వేతనాల చెల్లింపు కోసం వెంటనే చర్యలు తీసుకోవాలని బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు డిమాండ్ చేశారు. ఏరియా ఆసుపత్రిని ఆదివారం సందర్శించిన డీసీహెచ్ డాక్టర్ కోటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వర్కర్స్ యూనియన్ నాయకులు రాజ శేఖర్, రమేశ్, అన్వర్, వెంకటస్వామి, సాయి కృష్ణ, మాధవి, స్వాతి, లావణ్య, తిరుమల, దీప, లలిత, పూజ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉర్సు



ఉర్సు ఊరేగింపులో గుర్రం విన్యాసం

తాండూర్: మండలంలో ఉర్సు ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మండల కేంద్రం నుంచి తాండూర్ దర్గా వరకు సందల్‌తో ఊరేగింపు నిర్వహించారు. గుర్రాల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. భక్తులు దర్గా వద్ద చాదర్లుకప్పి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రజలు ఉర్సు శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఎస్సై కిరణ్‌కుమార్ సూచించారు. పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి నిర్వాహకులతో మాట్లాడారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

యువతకు ఉపాధి



షూస్, గ్లౌజ్‌లు అందజేస్తున్న అంజనీపుత్ర ఎస్టేట్ చైర్మన్ గుర్రాల శ్రీధర్

జైపూర్: యువతకు, కార్మికులకు స్థానిక వెంచర్లలో ఉపాధి కల్పిస్తూ అందరి సహకారంతో ముందుకు సాగుతున్నట్లుగా అంజనీపుత్ర ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చైర్మన్ గుర్రాల శ్రీధర్ తెలిపారు. మండల కేంద్రంలో గల అంజనీపుత్ర ఎస్టేట్ సంస్థ ద్వారా చేపడుతున్న శ్రీ గంధం, ఎర్రచందనం మొక్కల పంపకంలో పని చేస్తున్న కార్మికులకు ఆదివారం షూస్, గ్లౌజ్స్ పంపిణీ చేశారు. సంస్థ ద్వారా శ్రీగంధం మొక్కల పెంపకం ప్రాజెక్టులో పనిచేస్తున్న కార్మికులందరికీ భద్రత కల్పిస్తున్నట్లుగా తెలిపారు.

గుంతలు పూడ్చివేత



భీమారం: చెన్నూరు–మంచిర్యాల జాతీయ రహదారిలో భీమారం వద్ద ఏర్పడ్డ గుంతలను బ్లేడ్ ట్రాక్టర్ రప్పించి కంకరతోపాటు మట్టివేసి నింపి ఆదివారం ఎస్సై శ్వేత మరమ్మతు చేపించారు. వాహన దారుల ఇబ్బందులను గుర్తించి గుంతలు పూడ్పించిన ఎస్సైని పలువురు అభినందిస్తున్నారు.

కప్పతల్లికి పూజలు



జన్నారం: వర్షాలు పడకపోవడంతో జన్నారం మండలంలోని దేవునిగూడలో ఆదివారం కప్పతల్లికి పూజలు చేశారు. రోకలుకు కప్పను కట్టి ఇంటింటికీ వెళ్లగా, ప్రజలు బిందెలతో నీటిని పోశారు.

'282' జీవో రద్దు చేయాలి



మాట్లాడుతున్న మేకల దాసు

పాతమంచిర్యాల: కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన షాప్ అండ్ ఎస్టాబ్లిష్ జీవో నం.282 ను రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం జిల్లా సమితి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షు డు మిట్టపల్లి పౌలు, సీపీఐ పట్టణ కార్యదర్శి ఖలీందర్ అలీఖాన్, నాయకులు పాల్గొన్నారు.



మందమర్రిరూరల్: నెత్తిన బోనాలతో తరలివెళ్తున్న మహిళలు



జన్నారం: పోచమ్మ వద్దకు వెళ్తున్న మహిళలు, గ్రామస్తులు



పాత మంచిర్యాల: బోనాలతో శోభాయాత్రగా...

వైభవంగా ఆషాఢ బోనాలు

పాతమంచిర్యాల/తాండూర్/జన్నారం/భీమిని/మందమర్రిరూరల్/బెల్లంపల్లి/దండేపల్లి: జిల్లా వ్యాప్తంగా ఆషాఢం బోనాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. డప్పు చప్పళ్లతో ర్యాలీలు తీస్తూ గ్రామ దేవతలకు బోనం తీశారు. నైవేద్యాలు సమర్పించి, కోళ్లు, మేకలు బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఇంటిల్లిపాదిని సల్లంగా చూడు అంటూ వేడుకున్నారు. పోతరాజుల, భక్తుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. జిల్లా కేంద్రంలో గంగమ్మతల్లి, హమాలీవాడలో కట్టపోచమ్మకు, బెల్లంపల్లి గాంధీ నగర్‌లో భీమన్నకు, మందమర్రి బురుదగూడెంలో మహంకాళి అమ్మవారికి, వెంకటాపూర్, జన్నారం, తాండూర్, కన్నెపల్లి మండలాల్లో పోచమ్మకి, దండేపల్లి మండలం మాదాపూర్‌లో మడేలయ్యకు బోనాలు సమర్పించారు.



తాండూర్: పెద్దమ్మ తల్లికి మొక్కులు



బెల్లంపల్లి: భీమన్న దేవుడికి బోనాలతో వెళ్తున్న భక్తులు



దండేపల్లి: బోనాలతో రజకులు



శివ సత్తుల పూనకాలు



నస్పూర్: పట్టణ పరిధిలో ఆషాఢ బోనాల జాతర వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. సీసీసీ కార్నర్ వద్ద గల ఆదిపరాశక్తి భువనేశ్వరి మాతా దేవాలయం, శ్రీరాంపూర్ ఏరియా కొత్తరోడ్డులోని పోచమ్మ బోనాలు, సీసీసీలోని మడేల స్వామి బోనాల జాతరలను భక్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. మహిళలు బోనాలు నెత్తిన ఎత్తుకొని డప్పుచప్పుళ్ల మధ్య, శివసత్తుల పూనకాలతో, పోతరాజుల విన్యాసాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. సీసీసీ కార్నర్ వద్ద ఆదిపరాశక్తి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.



బోనంతో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

ఇన్‌చార్జీల పాలనలో ఇక్కట్లు



లక్సెట్టిపేట మున్సిపల్ కార్యాలయం

- కుంటుపడుతున్న 'లక్సెట్టిపేట' అభివృద్ధి
- పంచాయతీ నుంచి మున్సిపల్‌గా మారినా సౌకర్యాలు నిల్..
- అందుబాటులో ఉండని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న పట్టణ ప్రజలు

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్, టీపీఎస్ ఇన్‌చార్జీగా ఉండడంతో అభివృద్ధి కుంటుపడుతోంది. ఆదాయం అధికంగా ఉన్నప్పటికీ ప్రజలకు సౌకర్యాలు కల్పించడంలో మున్సిపల్ అధికారులు విఫలమవుతున్నారు. మున్సిపల్ పరిధిలో పదిహేను వార్డులున్నాయి. గ్రామ పంచాయతీ నుంచి మున్సిపల్‌గా అప్‌గ్రేడ్ అయినప్పటికీ, ప్రజలకు మాత్రం ఎలాంటి సౌకర్యాలు అందడం లేదు. డ్రెయినేజీ, రోడ్డు సౌకర్యం, ట్రాఫిక్, దుమ్మధూళి, అంతర్గత సీసీ రోడ్లు లేకపోవడంతో ప్రజలు నిరుత్సాహానికి గురవుతున్నారు. చైర్మన్, కౌన్సిలర్ల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలనతో కాలం వెల్లదీస్తున్నారు. రెగ్యులర్ సిబ్బందిని నియమించి ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇన్‌చార్జీలతోనే కాలం వెల్లదీత..

గతంలో విధులు నిర్వర్తించిన కమిషనర్ మారుతీప్రసాద్ లక్సెట్టిపేటకు రెగ్యులర్‌గా, కోరుట్లకు ఇన్‌చార్జీగా వ్యవహరించారు. ఆయన ఇటీవల బదిలీ కావడంతో సంపత్‌కుమార్ రెగ్యులర్‌గా విధుల్లో చేరారు. చేరిన కొద్ది రోజుల్లోనే మంచిర్యాలకు ఇన్‌చార్జీగా ఇవ్వడంతో రెండు మున్సిపాలిటీలకు విధులు నిర్వహిస్తున్నారు. కమిషనర్లు ఇన్‌చార్జీలుగా ఉండడంతో రెండు మున్సిపాలిటీలకు సరైన న్యాయం చేయలేకపోతున్నారు. గతంలో విధులు నిర్వహించిన టీపీఎస్ రాజ్‌కుమార్ ఇన్‌చార్జీగా వ్యవహరించారు. ఇటీవల ఆయన బదిలీ కావడంతో ఆయన స్థానంలో మంచిర్యాలలో టీపీఎస్‌గా విధులు నిర్వహిస్తున్న శ్యాంసుందర్ లక్సెట్టిపేటకు ఇన్‌చార్జీగా బాధ్యతలు చేపట్టారు. మున్సిపాలిటీ అభివృద్ధికి ముఖ్యమైన కమిషనర్, టీపీఎస్ ఇన్‌చార్జీలుగా వ్యవహరించడంతో అభివృద్ధి కుంటుపడుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. పనుల కోసం కార్యాలయానికి వస్తే అధికారులు అందుబాటులో ఉండడంలేదని వాపోతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకొని రెగ్యులర్ అధికారులను నియమించాలని కోరుతున్నారు.

ఇన్‌చార్జీగా ఇచ్చారు..



లక్సెట్టిపేటలో చేరిన కొద్ది రోజులకు మంచిర్యాలకు ఇన్‌చార్జీగా ఇచ్చారు. దీంతో రెండు మున్సిపాలిటీల్లో విధులు నిర్వర్తిస్తున్నాను. త్వరలోనే మళ్లీ పట్టణానికి వచ్చి పూర్తిస్థాయిలో ప్రజలకు సేవలందిస్తాను.

– సంపత్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, లక్సెట్టిపేట

పత్తి రైతుల పరేషాన్..!

- వర్షాల కోసం అన్నదాతల ఎదురుచూపులు
- యూరియా ద్రావణం, నానో యూరియా స్ప్రే చేయాలని వ్యవసాయాధికారుల సూచన



అంకూసాపూర్‌లో వాలిపోయిన పత్తి మొక్కలు

భీమారం: గతంలో ఎన్నడూ లేని విధంగా వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో మండలంలో పత్తి పంటకు నష్టం ఏర్పడే ప్రమాదం ఏర్పడింది. మే నెలలో వర్షాలు పడటంతో రైతులు ఉత్సాహంతో ఖరీఫ్ సీజన్ పనులు ప్రారంభించారు. మండలంలో 4500ఎకరాల్లో రైతులు పత్తి వేశారు. అనంతరం అనుకున్న స్థాయిలో వర్షాలు పడకపోవడంతో అన్నదాతలు ఎదురుచూస్తున్నారు.

రిస్క్ లేకపోవడంతో...

వరి పంటకు ఉన్న కష్టాలు పత్తి సాగుకు లేకపోవడంతో వరిపొలాల కట్టలను తొలగించి మరీ పత్తి పండిస్తున్నారు. లాభాలు రాకున్నా, నష్టాలు లేకపోవడంతో పత్తి వైపే మొగ్గు చూపుతున్నారు. భీమారం, మద్దికల్, ఆరెపల్లి, ఎలకేశ్వరం, పోలంపల్లి, అంకూసాపూర్, ధర్మారం, రెడ్డిపల్లి, దాంపూర్, బూర్గుపల్లి శివారులో పెద్ద ఎత్తున నల్లరేగడి భూములు ఉండటంతో పత్తి పంట ఏపుగా పెరుగుతోంది.

మండలంలో నమోదైన వర్షపాతం..

భీమారం మండలంలో గత సంవత్సరం జూన్‌లో 137.2మి.మీ, జూలై నెలలో 452.7మి.మీ, కురిసింది. ఈ సంవత్సరం జూన్‌లో 73.3మి.మీ, జూలై ఇప్పటివరకు 45.7మి.మీటర్ల వర్షపాతం నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది.

అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టినా..

నేను 8 ఎకరాల భూమిలో పత్తి సాగు చేస్తున్నాను. వర్షాలు లేని కారణంగా పత్తి మొక్కలు ఎండిపోయే దశకి చేరుకున్నాయి. వర్షాల స్థానంలో విపరీతమైన ఎండలు ఉన్నాయి. దీంతో పత్తి మొక్కలకు కలుపు పనులు నిలిపివేశాను. అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టాను. పరిస్థితి ఇలానే ఉంటే తీవ్రంగా నష్టపోతాను.

– పోటు జగదీశ్వర్ రెడ్డి, రైతు, ధర్మారం

వర్షపాతం తక్కువ ఉంది

మండలంలోనే తక్కువ వర్షపాతం నమోదు అవుతుంది. పత్తి రైతులు వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొనేందుకు పలు చర్యలు చేపట్టాలి. పత్తి మొక్కలు ఎండిపోకుండా ఒక లీటరు నీటికి 20గ్రాముల యూరియా కలిపితే, 2శాతం యూరియా ద్రవణం తయారు అవుతుంది. దీనిని పత్తిపై స్ప్రే చేయాలి. లేకుంటే నానో యూరియా స్ప్రే చేయాలి.

– సుధాకర్, ఏవో, భీమారం

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

- మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి



పూజలు నిర్వహిస్తున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

నస్పూర్: అమ్మవారి దయ వల్ల రాష్ట్రంలోని ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కార్మిక, ఉపాధికల్పన, భూగర్భ గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. నస్పూర్‌లోని ఆదిపరాశక్తి భువనేశ్వరి మాత ఆలయంలో ఆదివారం ఆయన ఆషాఢ మాస బోనాల సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొనగా, ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధిపై అమ్మవారి చల్లని చూపు ఉండాలని ఆకాంక్షించారు.

సర్వత్రా ఆసక్తి...

చెన్నూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొట్టమొదటి సారిగా మంచిర్యాల నియోజకవర్గంలోని ఓ కార్యక్రమంలో పాల్గొనడంతో ఆయన పర్యటనను నియోజకవర్గ ప్రజలు, పలు రాజకీయ పార్టీల నాయకులు, సాధారణ ప్రజలు ఆసక్తిగా గమనించారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు ఎవరూ ఆయనను కనీసం మర్యాదపూర్వకంగా కలువకపోవడం ఆశ్చర్యానికి గురి చేసింది. మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్, స్థానిక సీఐ అశోక్ బందోబస్తులో పాల్గొన్నారు.

సమస్యలన్నింటినీ పరిష్కరిస్తా

రామకృష్ణాపూర్: బొక్కలగుట్టలో నెలకొన్న సమస్యలన్నింటిని తాను తప్పక పరిష్కరిస్తానని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. గ్రామంలోని రైతువేదిక వద్ద గ్రామస్తులు ఆయనను ప్రత్యేకంగా సన్మానించారు. గ్రామంలో నెలకొన్న పలు సమస్యలపై మంత్రికి వినతిపత్రం అందించారు. మంత్రి మాట్లాడుతూ.. గ్రామంలో మౌలిక సదుపాయల కల్పనపై ప్రత్యేక దృష్టిసారిస్తానని చెప్పారు. కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ భాస్కర్, మాజీ సర్పంచ్ కిషన్ రావు, మాజీ ఎంపీపీ బొలిశెట్టి కనకయ్య, బలికొండ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి ఆటో డ్రైవర్ల వినతి

శ్రీరాంపూర్: రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామికి ఆటో కార్మిక సంఘం నాయకులు వినతిపత్రం సమర్పించారు. మహాలక్ష్మీ పథకం వల్ల ఆటో డ్రైవర్ల ఉపాధి దెబ్బతిందన్నారు. ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ ఏరియాల అధ్యక్షులు రాగిడి రాజు, చెల్ల విక్రమ్, పులి రాజేందర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

రక్తదాన శిబిరం

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రక్తనిధి కేంద్రంలో ఆదివారం హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థకు చెందిన 15మంది సభ్యులు రక్తదానం చేశారు. శ్రీ రామచంద్ర మిషన్ గురువు పార్థసారథి రాజగోపాల్ 98వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని రక్తదానం చేసినట్లు, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ జోనల్ ఇన్‌చార్జి సతీశ్, జిల్లా కో ఆర్డినేటర్ ప్రవీణ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ భాస్కర్ రెడ్డి, రక్తనిధి కేంద్రం ఇన్‌చార్జీ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. ప్రశంసా పత్రాలు అందించారు.

శాశ్వత పరిష్కారం చూపాలి

కోటపల్లి: సిర్సా గ్రామంలోని హనుమాన్ టెంపుల్ కాలనీలో రెండు రోజులుగా విద్యుత్ లేకపోవడంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నట్లు కాలనీవాసులు తెలిపారు. ఇలాంటి సమస్యలు తరుచుగా జరుగుతున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలోని హనుమాన్ టెంపుల్ వీధిలో నెలకొన్న విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఘనంగా ఊరు కట్టడి

నెన్నెల: మండలంలోని నెన్నెల, ఆవుడం గ్రామాల్లో ఆదివారం ఊరు కట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. విపత్తులు, ప్రకృతి ప్రకోపాల నుంచి కాపాడేందుకు ఊరు కట్టడి చేస్తామని గ్రామ పెద్దలు తెలిపారు. వర్షాలు సంవృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని మొక్కులు చెల్లించుకున్నారు.

బంద్ జయప్రదం చేయండి

దండేపల్లి: జీవో నం.49 రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 21న ఆదివాసీ సంఘాలు తలపెట్టిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బంద్‌ను జయప్రదం చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘాల నేతలు ఆదివారం దండేపల్లిలో మాట్లాడారు. బంద్‌కు అన్ని వర్గాల ప్రజలు, వాణిజ్య వ్యాపారులు స్వచ్ఛందంగా సహకరించి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ సేన మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు పెంద్రం శ్రీనివాస్, జిల్లా గౌరవ అధ్యక్షుడు కోవ దేవ్‌రావ్, తుడుందెబ్బ మండల అధ్యక్షుడు కనక జంగు, ఆదివాసీ సేన మండల యూత్ అధ్యక్షుడు మంగం సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదివాసీ సంఘాల నాయకులు

కోటపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొమురం భీం కన్జర్వేషన్ కారిడార్ పేరిట తీసుకొచ్చిన జీవో 49ను వెంటనే రద్దు చేయాలని ఆదివారం తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు జేక శేఖర్ డిమాండ్ చేశారు. ఈ నెల 21న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు బండి రమేశ్, రాష్ట్ర నాయకులు మాంతయ్య, చెన్నూర్ డివిజన్ ఇన్‌చార్జి దుర్గే జైలు పాల్గొన్నారు.

జాతీయస్థాయి బహుమతి

లక్సెట్టిపేట: రావిప్రోలు సుబ్రహ్మణ్యం స్మారకంగా విశాలాక్షి సాహిత్య మాసపత్రిక ఆధ్వర్యంలో నెల్లూరులో నిర్వహించిన కవితల పోటీల్లో పట్టణానికి చెందిన రాజేశ్వర్‌రావుకు జాతీయ స్థాయి రెండో బహుమతి లభించినట్లు తెలిపారు.